# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈరోజు జరిగిన 56వ సీఆర్డీఏ సమావేశంలో పలు అంశాలకు ఆమోదం లభించింది.
- మద్యం బెల్టు షాపుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- “ఆవకాయ సినిమా సంస్కృతి, సాహిత్యోత్సవం” జనవరి 8 నుండి 10 వరకు విజయవాడ వేదికగా జరగనుంది.
- గర్భిణీలకు టిఫా స్కానింగ్ సేవలు రాష్ట్రంలోని 7 ఆసుపత్రులలో కొత్తగా అందుబాటులోకి వచ్చాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

====================

రాజధాని అమరావతి ప్రాంతంలో ఆధునిక హంగులతో సాంస్కృతిక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు త్వరితగతిన భూమిని గుర్తించాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) 56వ సమావేశం ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈరోజు జరిగింది. ఈ సమావేశంలో వివిధ అంశాలకు ఆమోదం లభించింది. ఆ వివరాలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ పాత్రికేయులకు వెల్లడిస్తూ.... అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ప్రాంగణంలో 2 ఎకరాల విస్తీర్ణంలో 103 కోట్ల రూపాయలతో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు సీఆర్డీఏ ఆమోదం తెలిపిందన్నారు. అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలకు అదనపు సౌకర్యాల కల్పనకు 109 కోట్ల రూపాయలు కేటాయింపులకు సైతం ఆమోదం లభించిందని మంత్రి నారాయణ తెలియజేస్తూ..

(వాయిస్ 31 సెకన్లు)

====================

అనధికార మద్యం విక్రయ కేంద్రాలుగా తయారైన బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. బెల్టు షాపులను పూర్తి స్థాయిలో కట్టడి చేయడానికి హర్యానాలో అనుసరించిన సబ్ లీజు విధానాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖపై ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఆదాయమే లక్ష్యంగా విధానాలు ఉండకూడదని, మద్యాన్ని కూడా ఒక ఉత్పత్తిలానే పరిగణించాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. అక్రమ మద్యాన్ని అరికట్టడం, బెల్టు షాపుల నియంత్రణ, డిజిటలైజేషన్, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సంస్కరణలు తీసుకురావాల్సిందిగా అధికారులను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు.

====================

తెలుగు సినిమా, సాహిత్యం, కళల వైభవాన్ని చాటి చెప్పేలా విజయవాడలో జనవరి 8 నుండి 10 వరకు "ఆవకాయ" సినిమా సంస్కృతి, సాహిత్యోత్సవం పేరిట వినూత్న సాంస్కృతిక వేదికను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలోని ప్రచార విభాగంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను మంత్రి వెల్లడించారు. మూడు రోజుల పాటు సాగే ఈ వేడుకలు విజయవాడ కృష్ణా నది ఒడ్డున పున్నమి ఘాట్, భవాని ఐలాండ్ లలో జరగనున్నాయని చెప్పారు. ఈ ఉత్సవం ఆంధ్రప్రదేశ్ వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడమే కాకుండా, స్థానిక కళాకారులకు, కళాభిమానులకు ఒక గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. సినిమా, సాహిత్యం, సంగీతం, నాటక రంగం, సాంస్కృతిక చర్చలను ఒకే బహిరంగ వేదికపైకి తెచ్చి రాష్ట్రాన్ని సాంస్కృతిక మార్పిడికి, కళాత్మక భాగస్వామ్యానికి ఒక శక్తివంతమైన గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నామని మంత్రి కందుల దుర్గేష్ వివరిస్తూ ....

(వాయిస్ 27 సెకన్లు)

విరామం

====================

గర్భిణీ, శిశు సంరక్షణ చర్యల్లో భాగంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం తొలి సారిగా రాష్ట్రంలోని 7 ద్వితీయ శ్రేణి ఆసుపత్రులలో 'టిఫా' (Targeted Imaging for Fetal Anomalies-TIFFA) స్కానింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. నర్సీపట్నం, తుని, నందిగామ ఏరియా ఆసుపత్రుల్లోనూ, ఒంగోలు మాతా శిశు వైద్యశాలలోనూ, పార్వతీపురం మన్యం, తెనాలి, అనకాపల్లి జిల్లా ఆసుపత్రులలో ఈ టిఫా స్కానింగ్ సౌకర్యాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వాటి పనితీరును పరిశీలిస్తున్నామని, వచ్చే ఏడాది జనవరి 1 నుంచి టిఫా స్కానింగ్ సేవలు పూర్తి స్థాయిలో గర్భిణీలకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

====================

అమరావతి రాజధాని పరిధి గ్రామాలలో మౌలిక వసతులు కల్పించే పనులను ముమ్మరం చేశామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా వడ్డమానులో రహదారిని ప్రారంభించిన అనంతరం ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... రాజధానిని గుంటూరు, విజయవాడ సహా పలు ప్రాంతాలకు అనుసంధానించే రోడ్డు పనులు ముమ్మరం చేస్తున్నామని చెప్పారు. అలాగే వెస్ట్ బైపాస్‌ను త్వరలో ప్రారంభిస్తామని, కరకట్టకు సమాంతరంగా సీఆర్‌డీఏ రోడ్డును మంగళగిరి రోడ్డుకు అనుసంధానిస్తామన్నారు. రాజధాని ప్రాంతంలో 900 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు డీపీఆర్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసిందని, వచ్చే నెలలో పనులు ప్రారంభమవుతాయన్నారు. వచ్చే 6 నెలల్లోగా రాజధాని పరిధిలోని గ్రామాలలో పనులన్నీ పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలియజేశారు.

====================

తిరుపతి జిల్లాలోని ప్రముఖ వాయులింగక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరున్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ ఈ రోజు దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈనెల 24వ తేదీ ప్రయోగించనున్న రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలంటూ శ్రీకాళహస్తీశ్వరుని ప్రార్థించినట్లు ఛైర్మన్ తెలిపారు. ఎల్‌వీఎం-3 ఎం6 (LVM3-M6) ద్వారా అమెరికాలోని ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ కంపెనీకి చెందిన బ్లూబర్డ్ బ్లాక్-2 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని నింగిలోకి ప్రవేశపెట్టనున్నామని తెలియజేశారు. ఈ రాకెట్ భారత అంతరిక్ష ప్రయోగ సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు.

====================

దేశ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి మాజీ ప్రధానమంత్రి అటల్ బీహారీ వాజ్‌పేయీ శ్రీకారం చుట్టారని పౌర విమానయాన శాఖా మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు. వాజ్‌పేయీ అందరూ మెచ్చిన కొనియాడారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అటల్-మోదీ సుపరిపాలన యాత్ర ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

====================

క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో 78వ జాతీయ అంతర్ రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలను ఒలింపిక్ పతక విజేత పి.వి. సింధుతో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు.

====================
====================